స్వదేశీ జ్ఞానాన్ని పునాదిగా గుర్తించాలి


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ జ్ఞానాన్ని అనుబంధంగా కాకుండా పునాదిగా గుర్తించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంగ్లిష్, విదేశీ భాషల విశ్వవిద్యాలయం(ఇఫ్లూ) లో 'స్వదేశీ/గిరిజన సంఘాలు - పరిశోధన పద్ధతులను పునర్నిర్మించడం' అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. జాతీయ పరిశోధన, విధాన చర్చలలో గిరిజన జ్ఞానం, సంప్రదాయాలు, పర్యావరణ జ్ఞానాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బిర్సా ముండా వంటి నాయకుల వారసత్వాన్ని, భారతదేశ సాంస్కృతిక, పర్యావరణ వారసత్వానికి గిరిజన సమాజాల విస్తృత సహకారాన్ని గుర్తించడంలో ప్రభుత్వం జాతీయ గౌరవ్ దివస్ నిర్వహించడాన్ని స్వాగతించారు. ఇఫ్లూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.నాగరాజు స్థానిక ప్రపంచ దృక్పథాల విద్యా ప్రాముఖ్యతను, విస్తృత పరిశోధన పర్యావరణ వ్యవస్థలో వారికి స్థలాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని వివరించారు. సమావేశంలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, గౌరవ అతిథి ప్రొఫెసర్ దీపక్‌కుమార్ బెహెరా, కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా, రిజిస్ట్రార్ ఐ/సి ప్రొఫెసర్ హరిప్రసాద్, ప్రొక్టర్ శ్యామ్‌రావు రాథోడ్, స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ సోన్బా ఎం సాల్వే, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ రాజునాయక్, ఇతర విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధనా పండితులు, బోధనేతర సిబ్బందితో సహా విస్తృత శ్రేణి వక్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డు పనులను పూర్తి చేయాలి

నల్లకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డు ఎంతో కాలంగా అస్తవ్యస్తంగా మారిందని, దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించడంలో స్థానిక ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. అసలే అధ్వానంగా మారిన రోడ్డుతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డును జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ, ఏఈ పృథ్వీ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో కలిసి ఆమె పరిశీలించారు.

జస్మత్ పటేల్‌కు ఆత్మీయ సత్కారం

నల్లకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ కోసం కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పురాతన ఆలయాల పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్న ప్రముఖ సంఘసేవకుడు జస్మత్ పటేల్ గుజరాతి సమాజ్ విశాఖపట్నం చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో లవ్ ఫర్ గో సంస్థ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా సంఘాలు, గుజరాతి సమాజ్ సంఘం సభ్యులు జస్మత్ పటేల్‌కు శాలువాకప్పి, మెమొంటో బహూకరించి ఘనంగా సత్కరించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు గురువారం సాయంత్రం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా పవిత్రాహ్వానం, స్వస్తివాచనం, రక్షాబంధనం, రుత్వికరణం, అగ్నిప్రతిష్ఠ, మూర్తిహోమం, నవకలశస్నపనం, హవనం తదితర కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ పర్యవేక్షించారు.

దివ్యాంగుల పెన్షన్లలో కేంద్రం వాటా పెంచాలి

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్లలో ఇస్తున్న రూ.300 వాటాను రూ.5వేలకు పెంచేందుకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కేంద్రంపై ఒత్తిడి తేవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అడివయ్య, కోశాధికారి ఆర్.వెంకటేష్, సహాయకార్యదర్శి నాగలక్ష్మి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, హైదరాబాద్ గౌరవాధ్యక్షుడు శశికళ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును న్యాయవాదులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ లేబర్‌కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురామ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు లేబర్‌కోర్ట్ న్యాయవాదులు రామచందర్‌రావును కలిశారు. రామచందర్‌రావు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేవిధంగా న్యాయవాదులు కృషి చేయాలని కోరారు.

13న శ్రీకృష్ణవేషధారణ పోటీలు

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి బ్రహ్మకుమారి కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 13న శ్రీకృష్ణవేషధారణ పోటీలను నిర్వహిస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి జయశ్రీ తెలిపారు. త్యాగరాయ గానసభలో 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగే ఈపోటీల్లో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదివే పిల్లలు పాల్గొనవచ్చునన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని, పోటీల్లో పాల్గొనేవారికి ఎలాంటి ఫీజు తీసుకోవడంలేదని స్పష్టం చేశారు. ఈనెల 12వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 93965 23408 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

కవాడిగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ వేడుకలు మతసామరస్యానికి ప్రతీక అని దోమలగూడ హనుమాన్ దేవాలయ చైర్మన్ కేఆర్‌కే ప్రసాద్ అన్నారు. గురువారం దోమలగూడ హనుమాన్ దేవాలయంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ కేఆర్‌కే ప్రసాద్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు నలంద్రి శ్రీనివాస్‌యాదవ్, కవాడిగూడ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్వర్, రాము, వై.కృష్ణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అల్లం ప్రభు, జె.మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ చట్టాలను అమలు చేయండి

నల్లకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ చట్టాలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ కోరింది. ఫార్మసీ ఆఫీసర్ల కల నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కార్య నిర్వహణ అధ్యక్షుడు కందకట్ల శరత్‌బాబుచ, కోశాధికారి యాదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జలిగామ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు.

తోటివారికి ఆపద సమయంలో సహాయపడాలి

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి ఆపదసమయంలో తోటివారికి సహాయపడాలని మల్కాజ్‌గిరి కోర్టు న్యాయమూర్తి భాషా నవాజ్‌ఖాన్ అన్నారు. ఆరాధన కల్చరల్‌అసోసియేషన్ 31వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకుప్రతిభాపురస్కారాల ప్రదాన కార్యక్రమం గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. డా.ఎన్.రఘు, మహ్మద్‌ఖాజావలీ, నిర్మలాప్రభాకర్, అయోధ్యరెడ్డి, రాధారాణి, శివానిరెడ్డి, సంజనరెడ్డి పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, ఉమర్‌ఖాన్, వెంకట్రావు, భాస్కర్‌గుప్త, రాఘవరెడ్డి, హమీద్, చలపతి, శివజ్యోతి, నిర్వాహకులు లోకం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను ఎప్పటికీ మరిచిపోవద్దు

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలను సమాజం ఎప్పటికీ మరిచిపోవద్దని ప్రముఖ సినీదర్శకులు రేలంగి నరసింహారావు అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత తిరుమల వెంకటస్వామి(టీవీ స్వామి) రచించిన కవితావిక కవితాసంపుటి ఆవిష్కరణ, అంకితోత్సవ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన దర్శకులు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ కళాకారులు చివరి వరకు అభిరుచిని కొనసాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, విద్యావేత్త ఉమాశశి, రాంబాబు, కోకా భవాని, సంస్థ స్థాపక కార్యదర్శి ప్రముఖ కవి రఘుశ్రీ పాల్గొన్నారు.


విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు


విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ముషీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్‌లోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహాసుదర్శన హోమం, అభిషేకాలు, అన్నదానం, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీప అలంకరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సదా, శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, వీరేష్, రామకృష్ణ, నాయకులు అశోక్ చారి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

నజరీ నక్ష పరిధిలో పోలింగ్ బూత్‌లు, ఓటర్ల పరిశీలన


ఆల్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి తదితరులు


ఆల్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట డీఎంసీ మారుతిదివాకర్ తదితరులు

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు, నజరీ నక్ష ప్రకారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నాయా, ఆ పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు అదే పోలింగ్ పరిధిలో ఉన్నారా, లేరా అనే అంశాలను పరిశీలిస్తున్నామని ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం సర్కిల్ కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని అఖిలపక్షం పార్టీలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు తిరుమల్, బీఆర్‌ఎస్ నాయకుడు కొండపల్లి మాధవ్, టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్, ఎంఐఎం నాయకులు అజీజ్ ఉల్లా ఉస్మాన్, సీపీఐ నాయకుడు శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, జీహెచ్‌ఎంసీ బూత్ లెవెల్ అధికారులతో రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు సమన్వయం చేసుకుని నజరీ నక్ష ప్రకారం పోలింగ్ బూత్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,08,813 ఉన్నాయని వీరిలో పురుషులు 1,57,920 ఉన్నారు, స్త్రీలు 1,50,880, ఇతరులు 13 మంది ఉన్నట్లు తెలిపారు.

అంబర్‌పేట సర్కిల్ పరిధిలో..

అంబర్‌పేట నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలతో అంబర్‌పేట డీఎంసీ మారుతిదివాకర్ సర్కిల్ కార్యాలయంలో నజరీ నక్షపై సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ నాయకుడు ఏడెల్లి అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నజరీనక్ష, పోలింగ్ బూత్‌లు, ఓటర్ల పరిధి తదితర అంశాలపై డీఎంసీ చర్చించారు.

రేజంగ్ల కళశ యాత్రను విజయవంతం చేయాలి

ఎడ్ల హరిబాబు యాదవ్

ముషీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న యాదవులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు బిహార్ రాష్ట్రం నుంచి ప్రారంభమైన రేజంగ్ల కళశయాత్ర ఈనెల 9వ తేదీన రాష్ట్రంలోని నారాయణ పేట్ మండలం నుంచి ప్రారంభమౌతుందని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ తెలిపారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం ముషీరాబాద్‌లోని యాదవ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎడ్ల హరిబాబుయాదవ్ మాట్లాడుతూ... రేజంగ్ల కళశ యాత్ర రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పెద్ద ఎత్తున కొనసాగుతుందన్నారు. ఈ నెల 16న హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో భారీ బహిరంగ సభ, కళశయాత్ర పూజలు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు, అఖిల భారత యాదవ్ మహాసభ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. యాత్ర ముగింపు సభ రాష్ట్రంలోని సిరిపుర్ కాగజ్‌నగర్‌లో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ముఖ్య సలహాదారులు బి.బాబూరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి పట్టుపడితే కఠిన చర్యలు


వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ట్రాఫిక్ సీఐ

కవాడిగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మందు తాగి పట్టుబడిన వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ పి.వెంకటలక్ష్మి హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం ఇందిరా పార్కు ధర్నా చౌక్ చౌరస్తాలో గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని వాటిని అరికట్టేందుకే ఏ సమయంలో ఎక్కడైనా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు వాహనదారులు పట్టుబడ్డారని, వారిపై కేసులు నమోదు చేసి వారి వాహనాలను సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించిన వారపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ తనఖీల్లో ఎస్‌ఐ పెంటాగౌడ్‌తోపాటు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ అక్రమ నిర్మాణంపై హైడ్రాకు ఫిర్యాదు

ముషీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లోని కవాడిగూడ తాళ్లబస్తీలో నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఐదు అంతస్తుల భవనం నిర్మించారని, ఈ అక్రమ నిర్మాణం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికుడు చంద్రప్రకాష్ తెలిపారు. అక్రమ నిర్మాణం వల్ల ప్రజలకు ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. గురువారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రప్రకాష్ మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ నిబంధనలను పాటించకుండా అనాధికారికంగా భవనం నిర్మించారని ఆరోపించారు. ఈ సమస్యపై జీహెచ్‌ఎంసీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు, పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు భవనయజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'భగవత్ గీత' పోటీల్లో విజేతకు బహుమతి

ముషీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగత్‌గురు ఆదిశంకరాచార్యులు స్థాపించిన శృంగేరి శారదాంబ పీఠం కర్ణాటక వారి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవత్ గీత పారాయణ పోటీల్లో ముషీరాబాద్‌కు చెందిన లింగాల మౌనిక శ్రీకాంత్‌గౌడ్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఆమెకు జగత్‌గురు విధుశేఖర భారతి స్వామి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ మేరకు ముషీరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భగవత్‌గీతను ప్రతి ఒక్కరూ పఠించాలన్నారు.

మాజీ సైనికులకు నగదు రహిత వైద్య సేవలు

అల్వాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రాసబ్ ఏరియా(టాసా) రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందించనున్నారు. స్పార్ష్ హాస్పిస్, రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్‌తో టాసా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం టాసా ప్రధాన కార్యాలయంలో ఎంవోయూ పత్రాలపై మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ రాజీవ్ సంతకాలు చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఎంవోయూతో తెలుగు రాష్ట్రాల్లోని 2,80,749 మందికిపైగా ఉన్న మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు వైద్యఖర్చులు తగ్గుతుందన్నారు.

బీసీల 42శాతం రిజర్వేషన్లపై దొంగ నాటకాలు

కవాడిగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ దొంగ నాటకాలను ప్రజలను గమనిస్తున్నారని ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఇప్పటికైనా బీసీలను ఈరెండు పార్టీలు మోసం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో దిడ్డి సుధాకర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బుర్రా రాముగౌడ్, యువవిభాగం మాజీ అధ్యక్షుడు విజయ్ మల్లంగి మాట్లాడారు. ఢిల్లీలో చేపట్టిన కాంగ్రెస్ ధర్నాపై తీవ్ర విమర్శలు చేశారు.

నిర్బంధం, ఆంక్షలను మానుకోవాలి: సీఐటీయూ

రాంనగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కార్మిక పోరాటాలపై నిర్బంధం, ఆంక్షలను ప్రభుత్వం మానుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలగుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ.రమ, కోశాధికారి వంగూరి రాములు, నాయకుడు జె.వెంకటేష్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా ప్రజాపాలన సాగిస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి నేడు అదేపద్ధతి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మధ్యాహ్నం భోజనం కోసం పనిచేసే కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కాచిగూడ డివిజన్‌లో చెట్లకొమ్మల తొలగింపు

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. వర్షాకాలం సందర్భంగా ఈదురు గాలులతో చెట్లకొమ్మలు విరిగి పడి, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఈ చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. గురువారం జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏడీ నాగేశ్వర్‌రావు, జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్‌తో కలిసి మౌలానా ఆజాద్ నగర్‌లో పాదయాత్ర నిర్వహించి చెట్లకొమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, వాసు, శ్రీకాంత్, సతీష్, రంజిత్, రామకృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

వారి నుంచి మాకు ప్రాణహాని

పట్టాభి టవర్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో గల ఓ ఆస్పత్రి ఎండీ, అతని అనుచరుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని పట్టాభి టవర్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, కార్యదర్శి యు.విజయభాస్కర్, కోశాధికారి జి.జగన్మోహన్‌రెడ్డి చిక్కడపల్లి పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని పట్టాభి టవర్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ అపార్ట్‌మెంట్ పక్కన జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్మించడమే కాకుండా అపార్ట్‌మెంట్ వారిని అతని భవనానికి దారి అని చూపించి తప్పుడు పర్మిషన్ తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తాము జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేయగా వారు ఆస్పత్రి భవనాన్ని కొద్ది రోజుల క్రితం సీజ్‌చేశారని తెలిపారు. దీంతో డాక్టర్ తమపై కక్ష పెంచుకుని ఫిర్యాదు వెనక్కితీసుకోవాలని బెదిరిస్తున్నారని అన్నారు. ఒకవేళ ఫిర్యాదు వెనక్కి తీసుకోకపోతే 'మీ ఇంటికొస్తాం. మీ సంగతి చూస్తాం. చంపేస్తాం' అంటూ డాక్టర్ అనుచరులు తమకు ఫోన్‌లు చేసి బెదిరిస్తున్నారని చెప్పారు. 'మీరంతా రాయలసీమ. మేం లోకల్' మర్యాదగా ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కి తీసుకోండి అని కొద్ది రోజులుగా బెదిరిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై చిక్కడపల్లి పోలీసులు వెంటనే స్పందించి వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఇప్పటికే చిక్కడపల్లి సీఐ రాజు, ఎస్‌ఐకి ఫిర్యాదు చేశామని తెలిపారు.

భారీ వర్షం.. ట్రాఫిక్ జామ్

రాంనగర్‌లో రోడ్డు జలమయం



రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో రహదారులు, అంతర్గత రహదారులు జలమయం అయ్యాయి. దీంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు రాకపోకలు సాగించడంలో గంటన్నరపాటు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పద్మాకాలనీ, బాపూజీనగర్, నాగమయ్యకుంట, అంజయ్యనగర్, జెమిస్తాన్‌పూర్, గణేష్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు నానా ఇక్కట్లకు లోనయ్యారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్, అంబర్‌పేట ఛేనెంబర్ చౌరస్తా, ఆర్టీసీ కళాభవన్ చౌరస్తాలలో వర్షం నీరు నిలిచిపోయింది. జీహెచ్‌ఎంసీ డీఎంసీ రామనుజులరెడ్డి సిబ్బంది వర్షం నిలిచిపోయిన చోట నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అలాగే అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు చోట్ల నిలిచిపోయిన వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు అంబర్‌పేట డీఎంసీ మారుతిదివాకర్, సిబ్బందిచే పలు చర్యలు చేపట్టారు.


వర్షానికి గొడుగు పట్టుకుని వెళ్తున్న మహిళలు


వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రాజెక్టుల డిజైన్లు సొంతంగా రూపొందించండి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల డిజైన్లను సొంతంగా రూపొందించండని, ప్రైవేట్ కన్సల్టెంట్లపై ఆధారపడొద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన హెచ్-సిటీ, ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-2 పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూసేకరణపై సంబంధిత అధికారులతో గురువారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం, సవాళ్లను అధిగమించేందుకు వారానికి ఒకసారి జోనల్‌స్థాయిలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో జోనల్ కమిషనర్ల సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఐఐటీ, ఎన్‌ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రత్యేక కోర్సులు చదవి, జీహెచ్‌ఎంసీలో ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తోన్న వారిని గుర్తించి ప్రాజెక్టు డిజైన్‌లో భాగస్వాములను చేయాలని చీఫ్ ఇంజనీర్ (అడ్మిన్)ను ఆదేశించారు.

బావను రైలు కిందకు తోసేసిన బామ్మర్ది

- అక్కడికక్కడే మృతి
- ఇద్దరిని అరెస్ట్ చేసిన రైల్వే పోలీసులు

బర్కత్‌పురా ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అక్కను వివాహం చేసుకొని వేధింపులకు గురిచేస్తున్న బావను స్నేహితుడితో కలిసి బామ్మర్ది వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందికి నెట్టేశాడు. బావ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి బాధ్యులైన ఇద్దరు నిందితులను కాచిగూడ రైల్వే పీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే జీఆర్‌పీడీఎస్‌పీఎస్ ఎన్.జావేద్ గురువారం రాత్రి సీఐ ఎల్లప్పతో కలిసి వివరాలను వెల్లడించారు. యాకత్‌పురాకు చెందిన సిరాజ్(29) పెయింటర్. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ జమీర్(21) అక్కను వివాహం చేసుకున్నాడు.. కొంతకాలంగా వేధిచేస్తున్నాడు. దీంతో అక్క తమ్ముడు జమీర్‌కుతో బాధను వెల్లబోసుకుంది. దీంతో తన స్నేహితుడు మహ్మద్ జునైద్(23)తో కలిసి బావ సిరాజును చంపడానికి ప్లాన్‌చేశారు. ఈనెల 2న రాత్రి 10.58 గంటల సమయంలో సిరాజును మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని మాట్లాడుదామని మలక్ పేటరైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం చివరన సయ్యద్ జమీర్, సిరాజుల మధ్య మాటమాట పెరిగింది. అదే సమయంలో బెంగళూరు నుంచి కాచిగూడకు వస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందకు సిరాజ్‌ను నెట్టారు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్‌ని పరిశీలించారు. గురువారం సయ్యద్ జమీర్, మహ్మద్ జునైదును అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

10న దేశభక్తి పాటలు, కవితలు, నాట్య పోటీలు

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 10న దేశభక్తిపాటలు, కవితలు, నాట్య, దేశ నాయకుల వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ ఇ.సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. ఈనెల 8వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

'బీసీలను మోసగిస్తున్న రాజకీయ పార్టీలు'

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు పెంచుతామని సాధ్యం కాని హామీలు ఇస్తూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఓసీ సంక్షేమ సంఘం జాతీయఅధ్యక్షుడు జి.కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. గురువారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదని తెలిసి కూడా బీజేపీ, బీఆర్‌ఎస్ వంతపాడడం రాజకీయ పార్టీల దివాలకోరు తనానికి నిదర్శనం అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేత

ముషీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిర్వహించిన మహాధర్నాకు వెళ్లిన ముషీరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తేజాగౌడ్, తదితరులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తేజాగౌడ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టే పోరాటంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధిస్తామని తెలిపారు. త్వరలో జగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని ధీమావ్యక్తంచేశారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజాఠాకూర్, ముషీరాబాద్ నాయకులు పాల్గొన్నారు.

వారానికి ఒకసారైనా చేనేత దుస్తులు ధరించాలి

నల్లకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారైనా చేనేత దుస్తులు ధరించి చేనేత కార్మికులకు ప్రోత్సాహం అందించాలని అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వర్కాల కృష్ణ పేర్కొన్నారు. గురువారం సంఘంలోని నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంప్రతినిధులు మార్కండేయుడికి పూజలు నిర్వహించి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎలగందుల అంజయ్య, చిలక శివకుమార్, బి.అశోక్, జి.సత్తయ్య, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

13న ట్రంప్ దిష్టిబొమ్మల దహనం

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులను తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ తీవ్రంగా ఖండించారు. అమెరికా ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ నెల 13న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మల దహన కార్యక్రమం రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జారిపడి మహిళ మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ మెట్ల వద్ద క్లీనింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాచిగూడ పీఎస్ ఎస్‌ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలోని హిమ అపార్ట్‌మెంట్‌లో గతనెల 24న కొమరయ్య భార్య రాములమ్మ(60) క్లీనింగ్ చేస్తుండగా జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ.. గురువారం మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. సుభాష్ తెలిపారు.